సాక్షి
వరంగల్
శుక్రవారం | 17 | మే | 2024



సాంకేతిక విద్యకు సై..

ఉపాధి అవకాశాలు విస్తృతం..పైగా స్వల్ప కాలిక కోర్సు.. ఖర్చు కూడా తక్కువే.. ఇంకేముంది విద్యార్థులు సాంకేతిక విద్యపై ఆసక్తి చూపుతున్నారు. - 8లో ▸



పార్ట్‌టైం లెక్చరర్ల ధర్నా

కాకతీయ యూనివర్సిటీలో పార్ట్‌టైం లెక్చరర్లను కాంట్రాక్టుగా కన్వర్షన్‌చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం ఉదయం పరిపాలన భవనం వద్ద ధర్నా చేశారు. - 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
$32^0/26^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం సాధారణంగా ఉంటుంది. రోజంతా పొడిగా ఉంటుంది. పలు చోట్ల ఆకాశం మోఘావృతమై ఉండి, చిరుజల్లుల నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

పీఆర్‌సీ అమలు చేయాలి



కాశోజీ సెంటర్: ఉద్యోగ, ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే 51 శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్‌సీ అమలు చేయాలని పీఆర్‌టీయూ తెలంగాణ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఆయన సంఘం నాయకులతో కలిసి పీఆర్‌సీ కమిషన్ బాధ్యులను కలిశారు. ఆయన వెంట పీఆర్‌టీయూ రాష్ట్ర బాధ్యులు గార్లపాటి ఉమాకర్‌రెడ్డి, పార్వతి సత్యనారాయణ, జిల్లా బాధ్యులు కోలెపాక సంగీత, శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

కులగణన తర్వాతే 'స్థానిక' నోటిఫికేషన్ ఇవ్వాలి

కాశోజీ సెంటర్: రాష్ట్ర ప్రభుత్వం బీసీ కులగణన చేసి, పంచాయతీరాజ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ రిజర్వేషన్లను 50శాతానికి పెంచిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు జరపాలని ముదిరాజ్ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (మెపా) రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ ముదిరాజ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం ఆయన హనుమకొండలోని కార్యాలయంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచిన విధంగా ముదిరాజ్‌ల రిజర్వేషన్ అంశాన్ని స్థానిక ఎన్నికలలోపే పరిష్కరించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో స్థానిక సంస్థల రిజర్వేషన్లను 22 శాతం నుంచి 42శాతానికి పెంచుతామని పేర్కొన్నారని, స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి పలు సభలు, సమావేశాల్లో ఈ విషయాన్ని ప్రస్తావించారని గుర్తు చేశారు. ముదిరాజ్‌లకు ఇచ్చిన మాట ప్రకారం రిజర్వేషన్ అంశం పరిష్కారం కాకుంటే రానున్న కాలంలో అన్ని ముదిరాజ్ సంఘాలను కలుపుకుని మెపా ఆధ్వర్యంలో రిజర్వేషన్ సాధనకై ఉద్యమిస్తామని తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

కాశోజీ సెంటర్: ఆపదలో ఉన్న బాలబాలికలను రక్షించిన బాలలు, స్వచ్ఛంద సంస్థల బాధ్యుల నుంచి ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్‌కు జూలై 31తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సంక్షేమ అధికారి హైమావతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నూతన ఆవిష్కరణలు, అసాధారణ ప్రతిభాపాటవాలు, ఆటలు, కళలు, సాహిత్యం, సామాజిక సేవ, ధైర్యసాహసాలు తదిత ర అంశాల్లో ఈ అవార్డులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవార్డుల కోసం 5నుంచి 18 ఏళ్లలోపు బాలబాలికలు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. స్వచ్ఛంద సంస్థలైతే ఏడేళ్లు ఆపైన బాలబాలికల తరఫున పనిచేస్తూ వారి జీవితాల్లో మార్పు తీసుకొచ్చిన వారై ఉండాలని తెలిపారు. http:// awards. gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు.

సమష్టి కృషితోనే డెంగీ నివారణ



గీసుకొండ: సంబంధిత శాఖల సమన్వయంతో డెంగీ వ్యాధి నివారణ చేయాలని డీఎంహెచ్‌ఓ వెంకటరమణ అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో గురువారం జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా వైద్యులు, సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఏడాది 'సమాజంతో భాగస్వామ్యమై, డెంగీ వ్యాధిని నివారించుకుందాం' అనే నినాదంతో ముందుకు వెళ్తున్నామని అన్నారు. ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సుధార్‌సింగ్ మాట్లాడుతూ.. పట్టణ, గ్రామీణ ప్రాంతాలు అనే తేడా లేకుండా డెంగీ వ్యాధి వ్యాపిస్తుందని, ప్రతి శుక్రవారం డ్రై డే పాటిస్తూ దోమల లార్వాల స్థావరాలను గుర్తించి నిర్మూలించాలన్నారు. డెంగీ నిర్ధారిత ప్రాంతాల్లో యాంటీ లార్వా, దోమల నివారణ మందులను పిచికారీ చేయిస్తామన్నారు. ఎన్వీడీ స్టేట్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సత్యేంద్రనాథ్, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ గోపాల్‌రావు, డిప్యూటీ డెమో అనిల్‌కుమార్, సోమేశ్వర్, కిరణ్, ప్రకాశ్‌రెడ్డి, కుమారస్వామి, చక్రపాణి పాల్గొన్నారు.

విద్యార్థులు నైపుణ్యాలు పెంపొందించుకోవాలి

కేయూ క్యాంపస్: విద్యార్థులు నైపుణ్యాలు పెంపొందించుకోవాలని కేయూ వీసీ రమేశ్ అన్నారు. హనుమకొండలోని యూనివర్సిటీ మహిళా పీజీ కళాశాలలో ప్రిన్సిపాల్ సౌజన్య అధ్యక్షతన మ్యాజిక్ ఆఫ్ బస్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం ప్రాంగణ నియామకాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా వీసీ మాట్లాడుతూ.. టెక్నాలజీకి అనుగుణంగా నైపుణ్యాలపై దృష్టి సారించాలని సూచించారు.

మసకబారిన 'తెర'

ఇబ్బందుల్లో సింగిల్ స్క్రీన్ థియేటర్లు

- నేటి నుంచి వారం రోజుల విరామం
- ఇప్పటికే ఫంక్షన్ హాల్స్, షాపింగ్ మాల్స్‌గా మార్పు



మూసిఉన్న నగరంలోని అమృత థియేటర్

సాక్షి, వరంగల్: సింగిల్ స్క్రీన్ థియేటర్లకు కష్టకాలం వచ్చింది. కరోనా వ్యాప్తికి ముందు వరకు సరికొత్త సినిమాలతో ప్రేక్షకులను వినోదాన్ని అందిస్తూ ఆదాయాన్ని సమకూర్చిన ఆ థియేటర్ల తెరలు మసకబారిపోతున్నాయి. రోజులు గడుస్తున్న కొద్దీ మూతబడటమో.. ఫంక్షన్ మాల్స్, షాపింగ్ కాంప్లెక్స్, ఆస్పత్రులు లేదా.. మల్టీప్లెక్స్ థియేటర్లుగా పరివర్తన చెందడమో జరుగుతోంది. అయితే ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఒకప్పుడు 70కిపైగా సింగిల్ స్క్రీన్ థియేటర్లుంటే ఇప్పుడు 40ఉండడం గమనార్హం. ప్రస్తుతం కొత్త సినిమాల విడుదల నిలిచిపోవడంతో ఆ థియేటర్లు కూడా శుక్రవారం నుంచి ఈ నెల 23వరకు మూసివేయాలని నిర్ణయం తీసుకోవడం చర్చనీయాంశం.



షాపింగ్ కాంప్లెక్స్, ఫంక్షన్ హాళ్లుగా..

వరంగల్ నగరంలో దాదాపు నాలుగు దశాబ్దాల క్రితం నుంచే పదుల సంఖ్యలో సింగిల్ స్క్రీన్ థియేటర్లు కొనసాగుతుండేవి. కాలక్రమేనా కొన్ని మూతపడగా.. మరికొన్ని షాపింగ్ కాంప్లెక్స్, ఫంక్షన్ హాల్స్‌గా మారాయి. వరంగల్ రైల్వే గేట్ సమీపంలోని మార్కండేయ టాకీస్ ఆ తర్వాత సరోజ టాకీస్‌గా మారింది. రాజరాజేశ్వరి థియేటర్ కాలక్రమంలో సునీల్ థియేటర్‌గా మారింది. పాత బీట్ బజార్‌లోని రామ టాకీస్ షాపింగ్ కాంప్లెక్స్‌గా.. నవీన్ టాకీస్ ఫంక్షన్ హాల్‌గా మారింది. మట్టెవాడలోని కాకతీయ టాకీస్, కాకతీయ సిటీ కాంప్లెక్స్‌లోని 35ఎంఎం థియేటర్.. సీతారామాంజనేయ థియేటర్ కొద్ది సంవత్సరాల క్రితం వివిధ కారణాలతో మూతబడ్డాయి. మట్టెవాడ పోలీసు స్టేషన్ పక్క వీధిలోని దుర్గా టాకీస్ తర్వాత రామయ్య చిత్రమందిర్‌గా మారగా కరోనా తర్వాత ఈ థియేటర్ స్థానంలో ఫంక్షన్ హాల్ ప్రారంభమైంది. దీనికి సమీపంలోనే ఏళ్ల క్రితం ప్రారంభమైన శ్రీనివాస థియేటర్ 1994లో కూల్చేసి ఆ స్థానంలో రామలక్ష్మణ్ థియేటర్‌ను ప్రారంభించారు. దీని పక్కనే ఉన్న జెమినీ టాకీస్‌కు తోడుగా జెమినీ మయూరి 35ఎంఎం ఆ తర్వాత ఏషియన్ జెమినీ థియేటర్‌గా మారింది. వరంగల్–నర్సంపేట మార్గంలో ఉన్న వెంకట్రామ టాకీస్, గిర్మాజీపేటలో రాధిక థియేటర్లు నేటికీ ప్రేక్షకులకు వినోదాన్ని అందిస్తున్నాయి. పదేళ్ల క్రితం మూతబడిన ములుగురోడ్డులోని కృష్ణ టాకీస్ ప్రస్తుతం కియా మోటార్స్‌గా మారింది. వీటికి కొద్ది దూరంలో ఉన్న అలంకార్ టాకీస్‌కు అనుబంధంగా గీత్ కళామందిర్ థియేటర్లు నిర్వహణ భారం కావడంతో కూల్చేసి ఆ స్థానంలో రిలయన్స్ మార్ట్ నిర్మించారు. ఒకప్పుడు డబ్బా టాకీస్‌గా పిలిచే హనుమకొండ చౌరస్తాలోని జీఆర్ థియేటర్ కొద్ది సంవత్సరాల క్రితం జీఆర్ కాంప్లెక్స్‌గా మారింది. విజయ టాకీస్ కాస్తా ఏషియన్ విజయ థియేటర్‌గా మారింది. అయితే ప్రస్తుతం దాన్ని స్థానంలో ఆస్పత్రి కడుతున్నారని వినికిడి. అమృత, అశోక థియేటర్లు ఏళ్లుగా ప్రేక్షకులను అలరిస్తుండగా.. కాజీపేటలోని భవాని టాకీస్, శాంభవి టాకీస్‌లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి.



థియేటర్ ఎదుట ఏర్పాటుచేసిన బోర్డు

అప్పుడు ఫుల్.. ఇప్పుడు డల్

ఒకప్పుడు థియేటర్లలో సినిమా విడుదలైందంటే అదో పెద్ద హడావుడి. ప్రేక్షకులు వివిధ ప్రాంతాల నుంచి వచ్చి థియేటర్లలో క్యూ కట్టేవారు. హౌజ్‌ఫుల్ కలెక్షన్లు, ప్రేక్షకులకు అదనంగా కుర్చీలు తెప్పించాల్సిన పరిస్థితి ఉండేది. కాలక్రమేనా డిజిటల్ యుగం ఊపందుకోవడంతో ఓటీటీల్లోనే సినిమాలు వచ్చేస్తున్నాయి. దీనికితోడు మల్టీప్లెక్స్‌లు పెరుగుతున్నాయి. టికెట్ రేట్లు పెరగడం, మాల్స్, మల్టీప్లెక్స్‌లు పుంజుకోవడంతో వీటిని ఆదరించేవారి సంఖ్య నానాటికీ తగ్గుతోంది. ఇటీవల ప్రముఖ హీరోల సినిమా విడుదల లేకపోవడంతోపాటు చిన్న సినిమాలు చూసేందుకు ప్రేక్షకులు థియేటర్లకు వచ్చేందుకు అనాసక్తి చూపుతుండడంతో నిర్వహణ భారం పెరిగింది. ప్రతిరోజూ ఓ థియేటర్‌కు విద్యుత్, ఇతర ఖర్చులు కలుపుకుంటే రోజుకు రూ.20వేల వరకు భారం పడుతోంది. ఆ మేరకు ప్రేక్షకులు థియేటర్లకు రాకపోవడంతో యజమానులు నష్టపోవాల్సిన పరిస్థితి. దీంతో శుక్రవారం నుంచి ఈ నెల 23 వరకు సింగిల్ స్క్రీన్ థియేటర్లు మూసివేస్తున్నామని అమృత థియేటర్ మేనేజర్ మోహన్‌రావు అన్నారు. మగధీర సినిమా 50రోజులు హౌజ్‌ఫుల్ నడిచిందని, ప్రేక్షకుల ధాటికి తట్టుకోలేక అశోక థియేటర్‌లోనూ ప్రదర్శించాల్సిన పరిస్థితి వచ్చిందని ఆయన గుర్తు చేశారు. దండిగా సినిమాలు రావడంతో పాటు మరిన్ని సింగిల్ స్క్రీన్ థియేటర్ల కోసం అనుకూల మార్పులు రావాల్సి ఉందని ఆయన అభిప్రాయపడ్డారు.

మరో 22 డివిజన్లు!

గ్రేటర్ పరిధిలో 66 నుంచి 88కి పెరగనున్న సంఖ్య

- ప్రతిపాదనలకు సన్నాహాలు చేస్తున్న అధికారులు
- ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన తర్వాతే పునర్విభజన
- 2011 సంవత్సరం జనాభా లెక్కలే ప్రామాణికం



వరంగల్ అర్బన్: గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో డివిజన్ల సంఖ్య పెరుగనుంది. 66 నుంచి 88కు చేరనుంది. 2011 జనాభా లెక్కల ఆధారంగా బల్దియా అధికారులు డివిజన్ల పునర్విభజనకు ప్రతిపాదనలపై సన్నాహాలు చేస్తున్నారు. ప్రస్తుత గ్రేటర్ వరంగల్ పాలకవర్గానికి సుమారు రెండేళ్ల గడువు ఉంది. ఎన్నికలకు 6 నెలల ముందు అధికారికంగా ఉత్తర్వులు జారీ కానున్నాయని విశ్వసనీయ వర్గాల సమాచారం. వాస్తవానికి డివిజన్ల మధ్య జనాభా సంఖ్యలో వ్యత్యాసం 10 శాతం మాత్రమే ఉండాలి. కానీ, 2021 మార్చిలో రాజకీయ జోక్యం ఎక్కువ కావడంతో అధికారులు తలొగ్గారనే అప్పట్లో విమర్శలు వచ్చాయి. కొన్ని డివిజన్లలో జనాభా వృద్ధి రేటు గణనీయంగా తగ్గిపోవడం, మరికొన్ని డివిజన్లలో భారీస్థాయిలో జనాభా వృద్ధి పెరిగింది. ఈ పరిస్థితిని వివరిస్తూ అప్పట్లోనే మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, స్వచ్ఛంద సంస్థలు, వివిధ వర్గాల ప్రముఖులు, ప్రజాప్రతినిధుల నుంచి ప్రభుత్వానికి విజ్ఞప్తులు చేరాయి. దీంతో పునర్విభజన అనివార్యమైంది. కానీ, 2021 ఏప్రిల్‌లో ఎన్నికల తంతు ముగించేశారు. జనాభా వ్యత్యాసాన్ని సమీక్షిస్తూ కొత్త డివిజన్లు ఏర్పాటు చేసేందుకు అధికారులు కసరత్తు ప్రారంభించారు. 66 నుంచి 88 డివిజన్ల పెంపు ప్రతిపాదనలపై ప్రభుత్వానిదే తుది నిర్ణయం అని అధికారులు తెలిపారు.

1951లో మేజర్ మున్సిపాలిటీ..

ఫసిలి హైదరాబాద్ లోకల్ సెస్ 1309 చట్టం ప్రకారం 1899 సంవత్సరంలో వరంగల్ పట్టణంగా రూపుదిద్దుకుని 1929 నుంచి స్వతంత్రంగా పనిచేయడం ఆరంభించింది. 1959లో మేజర్ మున్సిపాలిటీగా ఆవిర్భవించింది. 1951 హైదరాబాద్ మున్సిపాలిటీల చట్టం ప్రకారం మొదటిసారి వయోజన ఓటు హక్కు ప్రాతిపదికన ఎన్నికలు జరిగాయి. 1959 జూలైలో స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీగా, 1960 జూలైలో తిరిగి సెలక్షన్ గ్రేడ్ మున్సిపాలిటీ శ్రేణికి చేరింది. హైదరాబాద్ మున్సిపాలిటీ చట్టం ప్రకారం 1961లో నగర విస్తీర్ణం 61.69 చదరపు కిలోమీటర్లకు విస్తరించింది. 1965 ఏప్రిల్ 1 నుంచి ఆంధ్రప్రదేశ్ మున్సిపాలిటీల చట్టం నగరంలో అమలులో ఉండేది. 1979లో మున్సిపాలిటీల పరిధిని 110 చదరపు కిలోమీటర్లకు విస్తరించారు. జీఓ ఎంఎస్ నంబర్ 450 ఎంఏ ప్రకారం 18-08-1994లో వరంగల్ సెలక్షన్ గ్రేడ్ శ్రేణి నుంచి నగర పాలక సంస్థగా ఏర్పాటైంది. అప్పుడు డివిజన్ల సంఖ్య 50కి పెరిగింది. 2001 జనాభా లెక్కలను ప్రామాణికంగా తీసుకుంటూ అప్పటి ప్రభుత్వం 2005 ఏప్రిల్ 28న డివిజన్ల పునర్విభజన చేసింది. పెరిగిన జనాభా ప్రకారం 50 నుంచి 53 డివిజన్లకు పెరిగాయి. 2013 మార్చి 16న ట్రైసిటీలోకి శివారులోని 42 గ్రామాలను విలీనం చేశారు. 110 చదరపు కిలోమీటర్లు ఉన్న నగరం కాస్త 407.7 కిలోమీటర్లకు విస్తరించింది. జనాభా కూడా 8,19,441కి చేరింది. 2015 జనవరిలో గ్రేటర్ వరంగల్ హోదా కల్పించారు. అదేసంవత్సరం జూన్ 16న అప్పటి ప్రభుత్వం 53 డివిజన్ల నుంచి 58కి పెంచింది. 2021 మార్చి 7న 58 డివిజన్ల నుంచి 66 పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

6కు చేరనున్న సర్కిళ్ల సంఖ్య..

మహా నగరపాలక సంస్థ పాలన స్వరూపాన్ని పూర్తిగా మార్చేందుకు గ్రేటర్ వరంగల్ తాజాగా డివిజన్ల పునర్విభజనపై దృష్టిసారించింది. సర్కిళ్ల సంఖ్య ప్రస్తుతం రెండుగా ఉంది. గతంలో ప్రభుత్వం 4 సర్కిళ్లుగా ఉత్తర్వులు జారీ చేసింది. తాజా డివిజన్ల పునర్విభజనతో సర్కిళ్ల సంఖ్య 6కు చేరే అవకాశాలు ఉంటాయని సీనియర్ అధికారులు భావిస్తున్నారు. డివిజన్ల పునర్విభజనపై ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన వెంటనే అధికారులు రంగంలోకి దిగనున్నట్లు సమాచారం.

పెరిగిన జనాభా..

బల్దియా పరిధిలో 66 డివిజన్ల జనాభా లెక్కలను పరిగణనలోకి తీసుకుంటే ట్రైసిటీతోపాటు 42 విలీన గ్రామాల్లో జనాభా వృద్ధి రేటు గణనీయంగా పెరిగింది. గ్రామాల నుంచి నగరానికి వలసల సంఖ్య ఎక్కువైంది. ప్రస్తుతం జనాభా 12.40 లక్షలు ఉంటుందని భావిస్తున్నారు. ప్రతి డివిజన్‌లో 14 వేలకు పైచిలుకు జనాభా ఉంటుందని, అందువల్ల డివిజన్ల సంఖ్య 88కి పెంపు అనివార్యమవుతుందని అధికారులు అభిప్రాయపడుతున్నారు.

సాక్షి మైత్రి మహిళ ఆధ్వర్యంలో బ్యూటీషియన్ కోర్సులో శిక్షణ

శిక్షణలో పాల్గొన్న వారికి సర్టిఫికెట్ల అందజేత



సాక్షి మైత్రి మహిళ

సాక్షి మైత్రి మహిళ ఆధ్వర్యంలో ఈ నెల 22 నుంచి జూన్ 21వ తేదీ వరకు బ్యూటీషియన్ కోర్సులో శిక్షణ ఇవ్వనున్నారు. ఆదివారం మినహా మిగిలిన రోజుల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు శిక్షణ ఇస్తారు.

శిక్షణలో నేర్పించే అంశాలు

థ్రెడ్డింగ్, వ్యాక్స్, పెడిక్యూర్, మెనిక్యూర్, బ్లీచింగ్, స్కిన్‌కేర్, హెయిర్ కేర్, వైట్నింగ్ ఫేస్ ప్యాక్స్, డ్యాండ్రఫ్ ట్రీట్‌మెంట్, హెయిర్ ఫాల్ ట్రీట్‌మెంట్, హెయిర్ కట్స్, హెయిర్ స్టైల్స్, హెన్నా ప్రిపరేషన్, డై అప్లికేషన్, మేకప్స్ (బ్రైడల్, పార్టీ, లైట్ మేకప్స్), పింపుల్ ట్రీట్మెంట్, హెయిర్ మసాజ్, కమ్యూనికేషన్ అండ్ గ్రూమింగ్, ఫేషియల్స్, సారీ డ్రాపింగ్.

రిజిస్ట్రేషన్ స్వీకరించు తేదీలు :

ఈ నెల 17వ తేదీ (నేటి) నుంచి 21వ తేదీ వరకు ఉదయం 10నుంచి సాయంత్రం 6గంటల వరకు.

వర్క్‌షాప్ షెడ్యూల్ తేదీలు:

ఈ నెల 22వ తేదీ నుంచి జూన్ 21వ తేదీ వరకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు శిక్షణ ఉంటుంది.

రిజిస్ట్రేషన్స్, శిక్షణ స్థలం :
శ్రీ శైలి బ్యూటీపార్లర్,
మొదటి అంతస్తు, భూషణం కాంప్లెక్స్
పోలీస్ స్టేషన్ ఎదురుగా,
హనుమకొండ చౌరస్తా, హనుమకొండ.
సెల్ : 9505514424
ఫీజు : రూ.3 వేలు

ఏఆర్‌ఓలు స్ట్రాంగ్‌రూంలను పరిశీలించాలి

- పటిష్టమైన పోలీసు భద్రతలో ఈవీఎంలు
- జిల్లా ఎన్నికల అధికారి ప్రావీణ్య



స్ట్రాంగ్‌రూం వద్ద అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

వరంగల్ : వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డులోని స్ట్రాంగ్‌రూంలను ఏఆర్‌ఓలు పరిశీలించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.ప్రావీణ్య ఆదేశించారు. ఏనుమాములలోని స్ట్రాంగ్‌రూంలను కలెక్టర్ గురువారం పరిశీలించి మాట్లాడారు. ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం ప్రత్యేకంగా కంట్రోల్ రూం ఏర్పాటు చేసి, ఆయా స్ట్రాంగ్‌రూంల సీసీ టీవీ కవరేజీని ఎల్‌ఈడీ స్క్రీన్లపై ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో వినియోగించి భద్రపరిచిన ఈవీఎంలు, ఎన్నికల సామగ్రి, స్ట్రాంగ్‌రూంలకు సంబంధించిన లాగ్ బుక్‌లు, సీసీ కెమెరాల పర్యవేక్షణ వాచ్‌రూంను కలెక్టర్ పరిశీలించారు. స్ట్రాంగ్‌రూంలు 24 గంటలు సాయుధ బలగాల రక్షణలో ఉంటాయని, సీసీటీవీ కెమెరాల ద్వారా నిరంతరం కంట్రోల్ రూంలో పర్యవేక్షించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. స్ట్రాంగ్‌రూం ఆవరణలో ఎవరికి అనుమతి ఉండదని, అభ్యర్థుల తరఫున వచ్చే ఏజెంట్లకు ప్రత్యేక రూం ఏర్పాటు చేసి స్ట్రాంగ్‌రూంల సీసీ టీవీ ఫుటేజీలను స్క్రీన్లపై ప్రదర్శించనున్నట్లు వివరించారు. ఆమె వెంట డీటీ రంజిత్, పోలీస్ అధికారులు, ఎన్నికల సిబ్బంది ఉన్నారు.

పాఠశాలల పనుల్లో వేగం పెంచాలి

గీసుకొండ: జిల్లాలోని అన్ని అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనుల్లో వేగం పెంచి వచ్చే నెల 5లోపు పూర్తి చేయాలని కలెక్టర్ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. గురువారం జాన్‌పాకలోని మండల ప్రజాపరిషత్ ఉర్దూ మీడియం, గుంటూరుపల్లి ఎంపీపీఎస్, కొమ్మాల అంగడి పాఠశాల, ఎంపీపీఎస్ బీఎస్‌పల్లి పాఠశాలల్లో జరుగుతున్న పనులను ఆమె పరిశీలించారు. జిల్లాలో అమ్మ ఆదర్శ పాఠశాలలుగా గుర్తించిన వాటిలో ఆహ్లాదకరమైన వాతావరణంలో పిల్లలు చదువుకునేలా ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రభుత్వం ద్వారా ఆయా పాఠశాలల్లో టాయిలెట్లు, తాగునీరు, విద్యుత్, సుందరీకరణ తదితర పనులు చేపడుతున్నట్లు చెప్పారు. కొనాయమాకులలోని ప్రగతి మండల సమాఖ్య భవనంలో సర్కారు బడుల విద్యార్థుల కోసం మహిళా సంఘాల వారు యూనిఫాంలు కుడుతున్న తీరును ఆమె పరిశీలించారు. జూన్ పది నాటికి మండలానికి సంబంధించిన మూడు వేల యూనిఫాంలను సిద్ధం చేయాలని చెప్పారు. అవసరమైతే మరి కొందరికి పని ఇప్పించాలని సూచించారు. అయితే ఒక్కో యూనిఫాం కుట్టడానికి రూ.50 ఇస్తున్నారని, వాటిని రూ.వందకు పెంచి ఇవ్వాలని మహిళా సంఘాల బాధ్యులు కలెక్టర్‌ను కోరారు. డీఈఓ వాసంతి, డీఆర్‌డీఏ ఏపీఎం రేణుకాదేవి, డీపీఎం భవాని, తహసీల్దారు రియాజుద్దీన్, ఎంపీడీఓ కృష్ణవేణి, ఎంపీఓ ప్రభాకర్, ఏపీఎం సురేశ్‌కుమార్, సీసీలు కోల శోభ, సుజాత, గడ్డి అశోక్, మండల సమాఖ్య అధ్యక్షురాలు కవిత తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలుపై నోరువిప్పని ఎమ్మెల్యే 'దొంతి'



ఖానాపురంలో నిరసన తెలుపుతున్న పెద్ది సుదర్శన్‌రెడ్డి, నాయకులు

- మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

ఖానాపురం: దొంగ హామీలతో గెలిపిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఎందుకు నోరు విప్పడంలేదని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ప్రశ్నించారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల్లో భాగంగా దొడ్డు రకంతోపాటు ఇతర పంటలకు రూ.500 బోనస్ చెల్లించాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలో గురువారం నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం సబ్ మార్కెట్ యార్డు వద్ద మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి మాట్లాడారు. ఎన్నికల తర్వాత మాటమారుస్తున్న కాంగ్రెస్‌కు బుద్ధిచెప్పాలన్నారు. ఎన్నికల ముందు ప్రగల్భాలు పలికిన ఎమ్మెల్యే మాధవరెడ్డి ఎన్నికలు ముగిసాక నోరువిప్పకపోవడం దుర్మార్గమన్నారు. బోనస్ ఇవ్వకుంటే ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద నిరసనలు తప్పవన్నారు. జెడ్పీ వైస్ చైర్మన్ ఆకుల శ్రీనివాస్, ఎంపీపీ ప్రకాశ్‌రావు, ఓడీసీఎంఎస్ చైర్మన్ రామస్వామి, వెంకటనర్సయ్య, శ్రీనివాస్‌గౌడ్, అశోక్, ప్రసాద్, అశోక్, వెంకన్న, శ్రీనివాస్‌గుప్త, యువరాజు పాల్గొన్నారు.

ఎస్‌డీఎల్‌సీఈ ఏడీగా గోపీనాథ్

కేయూ క్యాంపస్: కేయూ పరిధిలోని ఎస్‌డీఎల్‌సీఈ సైన్స్‌కోర్సుల అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీ)గా యూనివర్సిటీలోని మైక్రోబయాలజీ విభాగం కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ బి.వెంకటగోపీనాథ్‌ను నియమిస్తూ రిజిస్ట్రార్ మల్లారెడ్డి ఉత్తర్వులు జారీచేశారు. ఈ మేరకు గురువారం కేయూ వీసీ రమేశ్ ఉత్తర్వులు అందజేశారు. ఇప్పటివరకు సైన్స్‌కోర్సుల అసిస్టెంట్ డైరెక్టర్‌గా ఉన్న బాటనీ విభాగం కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ పి.కరుణాకర్ నుంచి ఈనెల 17న గోపీనాథ్ బాధ్యతలు స్వీకరించనున్నారు.

మండల సర్వసభ్య సమావేశం బహిష్కరణ



నిరసన తెలుపుతున్న ప్రజా ప్రతినిధులు

నల్లబెల్లి: ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయకపోవడాన్ని నిరసిస్తూ మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని సభ్యులు బహిష్కరించారు. ఎంపీపీ ఊడుగుల సునిత అధ్యక్షతన సమావేశం నిర్వహించేందుకు ఎంపీడీఓ నర్సింహమూర్తి ప్రయత్నిస్తుండగా ఎంపీటీసీ సభ్యులతోపాటు జెడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న అడ్డుకున్నారు. గత మండల సభ తీర్మానాల్లో ఒక్కటి కూడా అమలు చేయలేదని సభను బహిష్కరిస్తున్నట్లు ప్రకటించి సమావేశం నుంచి వెళ్లిపోయే ప్రయత్నం చేశారు. కాగా, సమావేశానికి హాజరైనట్లు సంతకాలు చేయాలని ఎంపీడీఓ కోరినప్పటికీ నిరాకరించి, ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ సునిత, జెడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న మాట్లాడుతూ.. ప్రభుత్వం రైతును మోసం చేస్తుందని మండిపడ్డారు. వైస్ ఎంపీపీ గందె శ్రీలత, ఎంపీటీసీలు బోళ్ల శ్రీలత, జయరావు, రవీందర్‌రావు, దేవునాయక్, విజయ, అజ్మీర లక్ష్మి, నజీమా బేగం ఉన్నారు.

భూగర్భ జలాలు పెంపొందించుకోవాలి



ఇల్లందలో ఉపాధి పనులను పరిశీలిస్తున్న బృందం

- సెంట్రల్ వాటర్ బోర్డు సైంటిస్ట్ గౌతమ్

వర్ధన్నపేట: భూగర్భజలాల పెంపొందించుకోవడానికి ఇంకుడు గుంతలు, ఫామ్ పాండ్స్ ఏర్పాటు చేసుకుని నీటిని పొదుపు చేసుకోవాలని సెంట్రల్ వాటర్ బోర్డు సైంటిస్ట్ ఎంఎస్ గౌతమ్ అన్నారు. మండలంలోని ఇల్లంద గ్రామంలో ఉపాధి హామీ పనులు, భూగర్భ జలాల పెంపుకోసం చేపట్టిన ఫాం పాండ్స్ తదితర పనులను గురువారం సెంట్రల్ వాటర్ బోర్డు సభ్యుల బృందం మండలంలోని పరిశీలించింది. ఈ సందర్భంగా బృందం ప్రతినిధి ఎంఎస్ గౌతమ్ గ్రామైక్య సంఘాల మహిళతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. భూగర్భ జలాలు పెంపొందించుకుని నీటిని పొదుపు చేయడం ద్వారా భూగర్భ జలాలు అడుగంటకుండా ఉంటాయన్నారు. దక్షిణ భారతదేశంలో 7 గ్రామాలు జాతీయ స్థాయి వాటర్ అవార్డులకు ఎంపికైనట్లు తెలిపారు. ఉపాధి హామీ పనులను సందర్శించి నీటి సంరక్షణ, వినియోగం ప్రయోజనాలను అడిగి తెలుసుకున్నారు. ఈ పర్యటనలో ఉపాధి హామీ పనులపై బృందం సంతృప్తి వ్యక్తం చేసింది. అనంతరం ప్రతినిధి గౌతమ్‌తోపాటు సభ్యులను ఘనంగా సన్మానించారు. ఈ బృందం వెంట డీఆర్‌డీఓ కౌసల్యాదేవి, ఎంపీడీఓ వెంకటరమణ, తహసీల్దార్ విజయసాగర్, ఎంపీఓ ధనలక్ష్మి, ఈజీఎస్ విభాగం అధికారులు రమేశ్, సురేశ్, నాగరాజు, సుధాకర్, సెర్ప సిబ్బంది వేణు, గోలి కొమురయ్య, ఎఫ్ఏ రేణుక, వీఓల ప్రతినిధులు అనూష, భాను, శ్రావణి, రజిత, స్వప్న, వీఓఎలు శోభ, స్రవంతి, పద్మావతి, రమ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్ మృతి కేసులో పురోగతి

- పోలీసుల అదుపులో నిందితులు
- కొనసాగుతున్న విచారణ

ఏటూరునాగారం: అంగన్‌వాడీ టీచర్ సుజాత మృతి కేసులో పోలీసులు పురోగతి సాధిస్తున్నారు. ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం చిన్న బోయినపల్లికి చెందిన రడం సుజాత తాడ్వాయి మండలం కాటాపురంలో అంగన్‌వాడీ టీచర్‌గా పనిచేస్తోంది. ఈనెల 14న ఆమె అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన విషయం తెలిసిందే. ప్రణాళికతో సుజాతను హత్య చేసి ఆమె శరీరంపై ఉన్న బంగారం ఎత్తుకెళ్లినట్లు పోలీసులు అనుమానించి ఆ దిశగా విచారణ చేపట్టారు. ఇందులో భాగంగా ఏటూరునాగారం మండలం రొయ్యూర్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. కాగా, సుజాతను కేవలం బంగారం కోసమే హత్య చేశారా..? లేక ఎవరైనా సుపారీ ఇచ్చి హత్య చేయించారా అనే కోణంలో పోలీసులు లోతుగా విచారణ చేపడుతునట్లు సమాచారం.

అకౌంట్ నుంచి డబ్బు కాజేసిన సైబర్ నేరగాళ్లు

తొర్రూరు: ఫోన్‌లో చాట్ చేసి సైబర్ నేరగాళ్లు ఓ వ్యక్తి అకౌంట్ నుంచి డబ్బు కాజేశారు. ఈ ఘటన డివిజన్ కేంద్రంలో చోటు చేసుకుంది. బాధితుడి కథనం ప్రకారం...పట్టణానికి చెందిన భూక్య జేతురాం ఫోన్‌కు గుర్తు తెలియని వ్యక్తి మెసేజ్ పంపాడు. దీనికి ప్రతిగా జేతురాం రిప్లై ఇచ్చాడు. అతడు ఇచ్చిన వివరాల మేరకు సైబర్ నేరగాళ్లు సదరు ఫోన్‌ను హ్యాక్ చేసి జేతురాం ఖాతాలోని రూ.9 వేలు కాజేశారు. అకౌంట్ బ్యాలెన్స్ చూసుకున్న బాధితుడు డబ్బు పోయిందని గ్రహించి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

నిరుద్యోగ సమస్య పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న అశోక్‌కుమార్

నయీంనగర్: ప్రభుత్వంపై పోరాడితేనే నిరుద్యోగ సమస్య పరిష్కారమవుతుందని, నిరుద్యోగుల గొంతుకగా ప్రశ్నించేందుకు తనను గెలిపించాలని గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి పాలకూరి అశోక్ కుమార్ కోరారు. ఈ మేరకు గురువారం హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తన మేనిఫెస్టో విడుదల చేశారు. బ్లాక్ మెయిల్ వ్యక్తులు పట్టభద్రులను మోసం చేసేందుకు పోటీ చేస్తున్నారని, అలాంటి వారికి ఓటు వేస్తే భవిష్యత్‌లో నిరుద్యోగులు, ఉద్యోగులు ఇబ్బందులు పడుతారన్నారు. రాష్ట్రంలో ఖాళీ ఉద్యోగాలు భర్తీ చేసేలా, జీఓలు 46, 317ను వెంటనే తొలగించేలా పోరాడుతానన్నారు. ప్రవీణ్, వినోద్, ప్రవీణ్, నవీన్ పట్నాయక్, వంశీ పాల్గొన్నారు.

సాంకేతిక విద్యకు సై..

ఐటీఐకి పెరుగుతున్న ఆదరణ

- కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం
- జూన్ 10 వరకు గడువు



కాజీపేట ప్రభుత్వ ఐటీఐ కళాశాల భవనం

కాజీపేట : ఉపాధి అవకాశాలు విస్తృతం..పైగా స్వల్ప కాలిక కోర్సు.. తక్కువ ఖర్చుతో కూడుకున్న విద్య. ఇంకేముంది విద్యార్థులు సాంకేతిక విద్య పట్ల మొగ్గు చూపుతున్నారు. పదో తరగతి పూర్తవగానే ఈ కోర్సును అభ్యసిస్తూ తక్కువ సమయంలో ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఉపాధి పొందుతున్నారు. ఫలితంగా ఈ విద్యకు రోజురోజుకూ ఆదరణ లభిస్తోంది. ఈ క్రమంలో ప్రభుత్వ పారిశ్రామిక సాంకేతిక శిక్షణ సంస్థ (ఐటీఐ) కళాశాలల్లో ప్రవేశాలకు ప్రభుత్వం దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు సాంకేతిక విద్య కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. జూన్ 10వ తేదీ వరకు గడువు ఉంది. ఐటీఐ పూర్తి చేసి అప్రెంటీస్ చేస్తే స్వయం ఉపాధి పొందడంతో పాటు వివిధ పరిశ్రమల్లో ఉద్యోగావకాశాలు ఉంటాయి.

ఉమ్మడి జిల్లా పరిస్థితి..

ఉమ్మడి జిల్లాలో ఆరు ప్రభుత్వ, మరికొన్ని ప్రైవేట్ ఐటీఐ కళాశాలలు ఉన్నాయి. ప్రభుత్వ కళాశాలలు ఉమ్మడి జిల్లాలోని వరంగల్, హనుమకొండ, కాజీపేట, జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్, ఏటూరునాగరంలో ఒక్కొటి చొప్పున ఉన్నాయి. వివిధ ప్రాంతాల్లో ప్రైవేట్ కళాశాలలు ఉన్నాయి. వాటిలో ప్రవేశాలకు సాంకేతిక విద్యా శాఖ అధికారులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, వెల్డర్, సివిల్, కంప్యూటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్, షార్ట్ హాండ్ తదితర కోర్సులు అందుబాటులో ఉన్నాయి. విద్యార్థులకు పదో తరగతిలో గ్రేడింగ్ ఆధారంగా సీట్ల కేటాయింపు ఉంటుంది.

దరఖాస్తు ఇలా...

దరఖాస్తు చేయడానికి iti. telangana. gov. in వెబ్‌సైట్‌లోకి లాగిన్ కావాలి. కుడి వైపున విద్యార్థి లాగిన్‌ను ఓపెన్‌చేయాలి. కొత్త రిజిస్ట్రేషన్ ఎంచుకుని, సెల్‌ఫోన్ నంబర్, మెయిల్ ఐడీని నమోదు చేసి సబ్‌మిట్ చేయాలి. సెల్‌ఫోన్‌కి యూజర్ నేమ్, పాస్‌వర్డ్ వస్తుంది. వాటి ఆధారంగా విద్యార్థి వివరాలను నమోదు చేయడంతో పాటు, పదో తరగతి ధ్రువపత్రం, ఇతర ధ్రువపత్రాలు అప్‌లోడ్ చేయాలి.

దరఖాస్తులు స్వీకరిస్తున్నాం

ఐటీఐలో ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నాం. పదో తరగతి పూర్తిచేసిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలి. ఐటీఐ పూర్తిచేస్తే మంచి ఉద్యోగావకాశాలు ఉన్నాయి. పదోతరగతి పూర్తిచేసిన వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలి. ఏ ట్రేడ్‌కు అయినా ఒకటే దరఖాస్తు సరిపోతుంది.

-కె.అశోక్‌కుమార్, ప్రిన్సిపాల్, కాజీపేట ఐటీఐ

కాజీపేట ఐటీఐలో ఎలక్ట్రీషియన్-20, ఎలక్ట్రానిక్ మెకానిక్-24, టర్నర్-20, డ్రాఫ్ట్స్‌మ్యాన్ సివిల్ -24, డ్రెస్ మేకింగ్-40, స్టెనో (ఇంగ్లిష్)-24 చొప్పున ఖాళీలున్నాయి.

ఈ కోచ్ మాకొద్దు..

స్పోర్ట్స్ అథారిటీకి క్రీడాకారుల ఫిర్యాదు

- 2016లో కూడా ఓసారి..
- బదిలీ అయినా తిరిగి ఇక్కడికే
- మాటలే తప్ప, శిక్షణ ఉండదని వినికిడి
- ఓ క్రీడాధికారి అండతో తిష్ట వేసిన కోచ్



వరంగల్ స్పోర్ట్స్: మెరుగైన శిక్షణ ఇవ్వాల్సిన కోచ్.. సూటిపోటి మాటలతో వేధింపులకు పాల్పడుతున్నాడు. మీకు తిండి దండగ.. మీకంటే పశువులు నయమంటూ మానసికంగా హింసిస్తున్నాడంటూ సీనియర్ క్రీడాకారులు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణకు ఫిర్యాదు చేశారు. ఎనిమిది సంవత్సరాల నుంచి వేధింపులు భరించలేని ఏడుగురు సీనియర్ క్రీడాకారులు నేరుగా హైదరాబాద్‌కు వెళ్లి సంతకాలతో కూడిన ఫిర్యాదును సాట్ డీడీకి అందజేశారు. ఫిర్యాదు చేసి నెల రోజులు గడుస్తున్నా సాట్ నుంచి ఎలాంటి విచారణ చేపట్టకపోవడం, కనీస చర్యలు తీసుకోకపోవడంతో క్రీడాకారుల భవిష్యత్ అగమ్యగోచరంగా మారింది.

అసలేం జరిగిందంటే..?

హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో వరంగల్ రీజనల్ స్పోర్ట్స్ హాస్టల్ కొనసాగుతోంది. హాస్టల్‌లో జిమ్నాస్టిక్స్, అథ్లెటిక్స్, హ్యాండ్‌బాల్ అకాడమీలకు చెందిన క్రీడాకారులు వసతి పొందుతూ అకాడమీలో శిక్షణ పొందుతున్నారు. ఈ క్రమంలో ప్రస్తుతం వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న కోచ్ 2015లో వరంగల్ అకాడమీ కోచ్‌గా వచ్చారు. కోచ్‌గా వచ్చి ఏడాది అయినప్పటికీ ఏ ఒక్కరోజు సక్రమంగా శిక్షణ ఇచ్చిన దాఖలాలు లేవు. తన ఇష్టానుసారంగా అకాడమీకి రావడం.. శిక్షణ తరగతులు నిర్వహించకుండా బాతాకానీ కొట్టడం పట్ల క్రీడాకారులు అసహనం వ్యక్తం చేశారు. ఈ విషయంపై అప్పటి సీనియర్ క్రీడాకారులు కోచ్‌ను నిలదీశారు. అనంతరం 2016లో సాట్ ఎండీకి ఫిర్యాదు చేశారు. స్పందించిన సాట్.. సదరు కోచ్‌ను ఆదిలాబాద్‌కు బదిలీ చేశారు. మూడు సంవత్సరాల పాటు అక్కడే ఉన్న ఆ కోచ్ తన పలుకుబడితో తిరిగి 2019లో హనుమకొండకు బదిలీ పై వచ్చాడు.

మాటలు తప్ప.. శిక్షణేది?

ఆరోపణలు ఎదుర్కొంటున్న కోచ్ సర్వీస్‌లో ఒక్క జాతీయ స్థాయి క్రీడాకారుడిని తయారు చేసిన దాఖలాలు లేవని, మాటలు తప్ప శిక్షణ ఇవ్వడనే విమర్శలు బాహాటంగానే వినిపిస్తున్నాయి. 2019 నుంచి ఇక్కడే విధులు నిర్వహిస్తున్న కోచ్ తన పద్ధతిని ఏ మాత్రం మార్చుకోలేదు. పై పెచ్చు క్రీడాకారులను సూటిపోటి మాటలతో వేధించడం పరిపాటిగా మారింది. వేధింపులను తట్టుకోలేని సీనియర్ క్రీడాకారులు ఏడుగురు గత నెలలో ఫిర్యాదు చేశారు.

చర్యలు శూన్యం..

ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తే న్యాయం జరుగుతుందని నమ్మితే.. చర్యల విషయం పక్కన పెడితే ఫిర్యాదు విషయం కోచ్‌కు తెలిసింది. జిల్లా స్థాయి క్రీడాధికారి, సదరు కోచ్ దగ్గరి మిత్రులు కావడంతో ఇప్పుడు ఆ క్రీడాకారుల పరిస్థితి పెనం నుంచి పొయ్యిలో పడిన చందాన తయారైంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు విచారణ చేపట్టి కోచ్‌ను బదిలీ చేయాలని పలువురు క్రీడాకారులు కోరుకుంటున్నారు.

పార్ట్‌టైం లెక్చరర్ల ధర్నా

- కాంట్రాక్టు లెక్చరర్లుగా కన్వర్షన్ చేయాలని డిమాండ్
- రిజిస్ట్రార్ చాంబర్‌లో భైఠాయించి ఆందోళన



రిజిస్ట్రార్ చాంబర్‌లో ఆందోళన చేస్తున్న పార్ట్‌టైం లెక్చరర్లు

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీలో పార్ట్‌టైం లెక్చరర్లను కాంట్రాక్టుగా కన్వర్షన్‌చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం ఉదయం పరిపాలన భవనం వద్ద ధర్నా చేశారు. అనంతరం మధ్యాహ్నం 2 నుంచి రిజిస్ట్రార్ చాంబర్‌లో బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా కేయూ పార్ట్‌టైం లెక్చరర్ల అసోసియేషన్ అధ్యక్షుడు వై రాంబాబు మాట్లాడుతూ ఈనెల 15న తాము ఆందోళన చేయగా రిజిస్ట్రార్ మల్లారెడ్డి పార్ట్‌టైం లెక్చరర్లను కాంట్రాక్టుగా కన్వర్షన్ చేసేందుకు ప్రభుత్వ అనుమతికోసం సంబంధిత ప్రిన్సిపల్‌సెక్రటరీకి లేఖ రాస్తామని హామీ ఇచ్చారన్నారు. కానీ ఆ లేఖలో 120మంది రెగ్యులర్, సెల్ఫ్‌ఫైనాన్స్ కోర్సుల్లో 16 పీరియడ్లతో పార్ట్‌టైం లెక్చరర్లు పనిచేస్తున్నారని, వారిని కాంట్రాక్టు లేదా అకడమిక్ కన్సల్టెంట్‌లుగా అప్‌గ్రేడ్ చేసేందుకు అనుమతి ఇవ్వాలని మాత్రమే పంపుతున్నట్లు ఉందన్నారు. ఈ లేఖను సంబంధిత అధికారులు పార్ట్‌టైం అధ్యాపకులకు చూపారని, అదిసరికాదని మార్చాలని డిమాండ్ చేశారు. ఈనెల15న ఏసీపీ దేవేందర్‌రెడ్డి సమక్షంలో జరిగిన చర్చలో రిజిస్ట్రార్ ఇచ్చిన హామీకి భిన్నంగా ఉందని తెలిపారు. కేయూ వీసీ రమేశ్.. పార్ట్‌టైం అధ్యాపకులను అఫిడవిట్ తీసుకురావాలని సూచించారన్నారు. కానీ అతనే గురువారం పరిపాలనాభవనానికి రాలేదని ఆరోపించారు. ఈ విషయంలో వీసీ ఆంతర్యమేమిటో అని తెలపాలని డిమాండ్ చేశారు. పార్ట్‌టైం లెక్చరర్లను కాంట్రాక్టుగా కన్వర్షన్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చే వరకూ తాము ఇక్కడి నుంచి కదలబోమని రాత్రి 10 గంటలైనా ఆందోళన కొనసాగిస్తున్నారు. ఈ కార్యక్రమంలో పార్ట్‌టైం అధ్యాపకుల సంఘం జనరల్‌సెక్రటరీ నరేందర్ నాయక్, బాధ్యులు దేవోజీ నాయక్, భాగ్యమ్మ, వినోద, సుజాత, విజయ, సుధీర్ ,అన్నపూర్ణ , మాధవి, వాణీదేవి, సృజన, కల్యాణి, ప్రియ, శ్రీధర్, ఫణి తదితరులు పాల్గొన్నారు. కాగా, పార్ట్‌టైం లెక్చరర్ల ఆందోళన చేస్తుండంతో వీసీ రమేశ్, రిజిస్ట్రార్ మల్లారెడ్డి పరిపాలనభవనానికి రాకుండా వీసీ లాడ్జ్ వద్ద నుంచే తమ విధులు నిర్వర్తించారు.

మరియ మాతకు వెండి కిరీటం బహూకరణ



కిరీటం బహూకరిస్తున్న బాలస్వామి, జయమ్మ దంపతులు

చెన్నారావుపేట: దాతలు.. మరియ మాతకు రూ.4 లక్షల విలువైన 3 కిలోల వెండి కిరీటం బహూకరించారు. తిమ్మరాయిని పహాడ్‌కు చెందిన నాగోతు లూర్ధయ్య, శౌరమ్మ దంపతుల జ్ఞాపకార్థం నాగోతు బాలస్వామి, జయమ్మ దంపతులు, వారి కుమారుడు అమెరికాలో ఉంటున్న జోసఫ్ అమృత రాజ్, డాక్టర్ మరియ సింధూర దంపతులు తమ కుమారుడు జయ దీక్షాంతలు..మరియమాతకు కిరీటం బహూకరించారు. శతావత్సర గ్రామ ఆవిర్భావ జూబ్లీ వేడుకల సందర్భంగా గురువారం పునీత రాయప్ప బోధన పీఠ దేవాలయం చర్చి ఫాదర్ తుమ్మ యాగారెడ్డికి వెండి కిరీటం అందించారు.

40 ఏళ్లుగా తప్పించుకుని తిరుగుతున్న ఖైదీ పట్టివేత



వీరన్న(రౌండప్‌లో ఉన్న వ్యక్తి)ను చూపుతున్న ఇరు జిల్లాల జైలు అధికారులు

దంతాలపల్లి: నలభై సంవత్సరాలుగా తప్పించుకు తిరుతున్న ఖైదీని గురువారం పట్టుకున్నట్లు మహబూబాబాద్, వరంగల్ జైల్ అధికారులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. 1982లో మహబూబాబాద్‌లో జరిగిన ఓ హత్యకేసులో మహబూబాబాద్ మండలం కంబాలపల్లికి చెందిన సందు వీరన్న జీవిత ఖైదు శిక్ష పడింది. 1984లో వీరన్న పెరోల్‌పై విడుదలయ్యాడు. పెరోల్ గడువు ముగిసినా జైలుకు వెళ్లలేదు. అప్పటినుంచి ఇప్పటివరకు జైలు అధికారుల కళ్లు కప్పి తిరుగుతున్నాడు. కొన్ని నెలలుగా తీవ్రంగా శ్రమించి తమకు వచ్చిన సమాచారం మేరకు గురువారం దంతాలపల్లి మండలం పెద్దముప్పారంలో పట్టుకున్నట్లు వారు తెలిపారు. వీరన్నను పట్టుకున్న ఆపరేషన్‌లో మహబూబాబాద్, వరంగల్ జైలు అధికారులు రామకృష్ణారెడ్డి, బి.నాగరాజు, వార్డర్లు యాసిన్, రఘు పాల్గొన్నారు. అప్పుడు అతని వయస్సు 27 కాగా, ఇప్పుడు 70 సంవత్సరాలు. వీరన్నను పట్టుకోవడంలో మహబూబాబాద్ సీఐ సర్వయ్య, దంతాలపల్లి ఎస్సై కరుణాకర్ సహకారం అందించారని అధికారులు తెలిపారు. నలభై సంవత్సరాల కేసును చేధించిన జైలర్లను ఉన్నతాధికారులు అభినందించారు.

సీసీఐ కొనుగోలు కేంద్రాలను పునఃప్రారంభించాలి

- జీఎంకు వినతిపత్రం అందజేసిన రైతు సంఘం నాయకులు




జీఎంకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

వరంగల్: సీసీఐ(కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా)కొనుగోలు కేంద్రాలను పునః ప్రారంభించి రైతులను ఆదుకోవాలని తెలంగాణ రైతు సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు సోమిడి శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు గురువారం వరంగల్ బ్రాంచ్ కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా జీఎం అర్జున్‌దవేకు సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ సీసీఐ కేంద్రాల ఏర్పాటు వల్ల క్వింటాకు ఎంఎస్‌పీ రూ. 7,020 కంటే ఎక్కువ లభించిందన్నారు. మార్చి 30వ తేదీ నుంచి సీసీఐ కేంద్రాలను మూసివేయడం వల్ల ప్రైవేట్ వ్యాపారులు.. రైతులు మార్కెట్‌కు తీసుకొచ్చిన పత్తిని మద్దతు ధర కంటే తక్కువకు కొనుగోలు చేస్తున్నారన్నారు. తద్వారా క్వింటాకు రూ.500 నుంచి 800 వరకు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీసీఐ కేంద్రాలు లేక పోవడం వల్లే ఇలా జరుగుతోందన్నారు. రైతు సంఘం అభ్యర్థన మేరకు స్పందించిన జీఎం వెంటనే వరంగల్ ఏనుమాముల మార్కెట్‌లో సీసీఐ సెంటర్‌ను ప్రారంభిస్తామని హామీ ఇచ్చినట్లు శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఓదెల రాజయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు ఊరటి హంసాల్‌రెడ్డి, కోశాధికారి సిరుల రవీందర్, సభ్యుడు జయపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విత్తన చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

- నాసిరకం విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే చర్యలు
- ఈస్ట్‌జోన్ డీసీపీ రవీందర్, డీఏఓ ఉష



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి ఉష

ఖిలా వరంగల్ : డీలర్లు.. విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ఈస్ట్‌జోన్ డీసీపీ రవీందర్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి డి. ఉష సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా రైతులకు నాసిరకం విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ మేరకు గురువారం వరంగల్ కలెక్టరేట్‌లో జిల్లా వ్యవసాయ శాఖ, అనుబంధ పోలీసు శాఖ సంయుక్త ఆధ్వర్యంలో డీలర్లు విత్తన, ఎరువులు, పురుగు మందుల చట్టాలపై అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి వారు ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. చట్టాలను అనుసరిస్తూ రైతులకు సకాలంలో నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు సరఫరా చేయాలని ఆదేశించారు. లేనిపక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం జాతీయ ఆహార భద్రత మిషన్ జిల్లా అధికారులు విత్తన చట్టాలపై డీలర్లకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏడీఏ కె.నాగేష్, ఏఓ జి. విజ్ఞాన్, పి.దయాకర్, సీతారెడ్డి, ఇన్‌స్పెక్టర్ డి. మహేష్‌కుమార్, మార్క్‌ఫెడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ రఘు, హార్టికల్చర్ వరంగల్ ఆఫీసర్ ఎస్.శంకర్, కె.శ్రేయ, పి.సారంగం, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



ఘటనాస్థలిలో వినయ్‌కుమార్

ఐనవోలు: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని పంథిని శివారు వరంగల్-ఖమ్మం రహదారిపై చోటు చేసుకుంది. ఎస్సై గైకడి అనిల్ కుమార్ కథనం ప్రకారం.. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలం సిరిసపల్లి గ్రామానికి చెందిన దిగ్గిశెట్టి వినయ్‌కుమార్(30) వ్యాపార నిమిత్తం సంవత్సరం నుంచి వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామంలో నివాసం ఉంటున్నాడు. ఈ క్రమంలో తన బంధువుల ఇంట్లో 5వ రోజు కార్యక్రమాల కోసం గురువారం ఉదయం 6 గంటల సమయంలో ద్విచ క్రవాహనంపై ఇల్లంద నుంచి స్వగ్రామం సిరిసపల్లికి బయలుదేరాడు. మార్గమధ్యలో వరంగల్-ఖమ్మం రహదారి లక్ష్మీపురం క్రాస్ సమీపం పంథిని శివారుకు చేరుకోగానే ఎదురుగా ఖమ్మం వైపునకు వెళ్తున్న లారీ.. ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. దీంతో వాహనం నుంచి కిందపడిన వినయ్ కుమార్‌కు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు క్షతగాత్రుడిని వెంటనే చికిత్స నిమిత్తం 108లో ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ ఘటనపై మృతుడి తండ్రి సత్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గైకడి అనిల్ కుమార్ తెలిపారు.

టీఎస్‌ఎన్పీడీసీఎల్‌లో ఇష్టానుసారంగా డిప్యుటేషన్లు

నిషేధం ఉన్నా పట్టని అధికారులు

- ఎన్నికల కోడ్ అమలులో ఉండగా ఉత్తర్వులు
- రద్దు చేసినట్లు చూపించి... మళ్లీ అక్కడే విధులు
- ఒకే తేదీతో మూడు ఉత్తర్వులు

హన్మకొండ: టీఎస్ ఎన్పీడీసీఎల్‌లో కొంతమంది డివిజనల్ ఇంజనీర్లు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. తామే యాజమాన్యం అన్నట్లుగా ప్రవర్తిస్తున్న తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అసోసియేషన్ నాయకులు కావడంతో తమకు ఎదురు లేదన్నట్లుగా దూకుడుగా ప్రవర్తిస్తున్నట్లు తెలుస్తోంది. టీఎస్ ఎన్పీడీసీఎల్‌లో డిప్యుటేషన్‌లపై యాజమాన్యం నిషేధం విధించింది. తప్పనిసరి అనుకుంటున్న డిప్యుటేషన్ చేసే అధికారం సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌కు మాత్రమే ఉంది. అయినా తమ కేమీ అడ్డు అన్నట్లుగా వ్యవహరిస్తూ, ఎన్నికల కోడ్ అమలులో ఉండగా ఉద్యోగులను డిప్యుటేషన్ వేశారు. ఎన్పీడీసీఎల్ హనుమకొండ రూరల్ డివిజన్ పరిధిలోని ఈఆర్‌ఓ కార్యాలయంలో పనిచేస్తున్న ఇద్దరిని హనుమకొండ రూరల్ డివిజన్ కార్యాలయానికి డిప్యుటేషన్ వేశారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న సమయంలో గత నెలలో హనుమకొండ రూరల్ డివిజనల్ ఇంజనీర్ ఈఆర్‌ఓలో పనిచేస్తున్న ఒక సీనియర్ అసిస్టెంట్‌తోపాటు మహిళ ఆర్టిజన్ ఉద్యోగిని డివిజన్ కార్యాలయానికి ఏప్రిల్ 4న డిప్యుటేషన్‌పై పంపిస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేశారు. ఉద్యోగుల అభిప్రాయం తెలుసుకోకుండానే ఉత్తర్వులు జారీ చేశారని సహచర ఉద్యోగులు తెలిపారు. హనుమకొండ రూరల్ ఈఆర్‌ఓలో స్టాఫ్ కొరత ఉన్నా.. డివిజన్ కార్యాలయంలో కావాల్సిన మేరకు స్టాఫ్ ఉన్నా కావాలని డిప్యుటేషన్‌పై తీసుకున్నారని, ఉద్యోగులను ఇబ్బందులకు గురి చేయడంలో భాగమేనని పలు ఉద్యోగ సంఘాలు తెలిపాయి. ఆ ఉద్యోగులకు వెళ్లాలని లేకున్నా, వారి ఇష్టానికి భిన్నంగా డివిజనల్ ఇంజనీర్ వ్యవహరించారని మండిపడుతున్నాయి.

రద్దు చేస్తూ ఉత్తర్వులు

డిప్యుటేషన్‌పై నిషేధం ఉండడంతోపాటు, ఎన్నికల కోడ్ అమలులో ఉండగా ఎలా చేస్తారని విమర్శలు వెల్లువెత్తడంతో మూడు రోజుల తరువాత దానిని రద్దు చేస్తున్నట్లు మరో ఉత్తర్వు జారీ చేశారు. అది కూడా పాత తేదీ ఏప్రిల్ 4వ తేదీతో డీఈ ఇచ్చారు. అదే తేదీతో వర్క్ ఆర్డర్ పేరుతో డివిజన్ కార్యాలయానికి తీసుకుంటున్నట్లు మరో ఉత్తర్వు జారీ చేశారు. ఈఆర్‌ఓ కార్యాలయానికి పంపకుండా డివిజనల్ ఇంజనీర్ కార్యాలయంలోనే వారి సేవలు పొందుతున్నారు. అంతకు ముందే పరకాల ఈఆర్‌ఓ నుంచి ఒక సీనియర్ అసిస్టెంట్‌ను డిప్యుటేషన్‌పై తీసుకున్నారు. ఇప్పుడు మరో సీనియర్ అసిస్టెంట్‌ను వర్క్ ఆర్డర్ పేరుతో డిప్యుటేషన్‌పై తీసుకుని మరో సీనియర్ అసిస్టెంట్‌కు సహాయకుడిగా పని చేయించుకుంటూ అవమానపరుస్తున్నాడని ఉద్యోగ సంఘాలు తెలిపాయి. తనను అడిగే వారు లేరన్నట్లుగా ఆ డీఈ ఒంటెద్దు పోకడలు పోతున్నారని మండిపడుతున్నాయి. ఇప్పటికైనా ఎన్పీడీసీఎల్ యాజమాన్యం స్పందించి ఎన్నికల కోడ్‌లో నిబంధనలకు విరుద్ధంగా డిప్యుటేషన్ చేయడంతోపాటు ఈఆర్‌ఓలో విధులు నిర్వర్తించాల్సిన ఉద్యోగినిని డివిజనల్ కార్యాలయంలో పని చేయించుకుంటున్న ఆ డివిజనల్ ఇంజనీర్‌పై చర్యలు తీసుకోవాలని ఉద్యోగ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

లక్షలు వెచ్చించి.. లక్షణంగా వదిలేశారు

నిరుపయోగంగా మండల సమాఖ్య భవనం

- రూ.76 లక్షల నిధులు నీళ్లపాలు
- శిథిలావస్థలో భవనం
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



నిరుపయోగంగా ఉన్న సమాఖ్య భవనం

కాజీపేట అర్బన్ : లక్షలు వెచ్చించి నిర్మించిన భవనాన్ని లక్షణంగా వదిలేశారు. అట్టహాసంగా ప్రారంభించిన అనంతరం పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఫలితంగా హనుమకొండ జిల్లా కాజీపేట మండలం కడిపికొండలోని రాజీవ్‌గృహకల్ప సముదాయంలో రూ. 76 లక్షల ఉపాధి హామీ నిధులతో నిర్మించిన మండల సమాఖ్య భవనం నిరుపయోగంగా మారింది.

12 ఏళ్లుగా నిరుపయోగం..

ఉపాధి హామీ పథకంలో భాగంగా 2012లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 76 లక్షలతో కడిపికొండ రాజీవ్‌గృహ కల్ప సముదాయంలో ఉపాధి హామీ కార్యక్రమాలకు గాను సమాఖ్య భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. అనుకున్నట్లు గానే ఏడాది లోపు 2013లో భవన నిర్మాణాన్ని పూర్తి చేసింది. దీంతో అప్పటి వర్ధన్నపేట ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్.. భవనాన్ని ప్రారంభించారు. అప్పటి నుంచి నిరుపయోగంగానే ఉంటోంది. 12 ఏళ్ల నుంచి భవనం ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటు కోసం ఎదురు చూస్తోంది.

శిథిలావస్థలో భవనం..

మండల సమాఖ్య భవనం 12 ఏళ్ల నుంచి నిరుపయోగంగా ఉండడంతో శిథిలావస్థకు చేరుకుంది. ఆరు గదుల్లో పూర్తిగా పగుళ్లు ఏర్పడ్డాయి. కిటికీల అద్దాలు పగిలి చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగి శిథిల భవనంగా మారింది. వినియోగంలోకి తీసుకురాకపోతే భవనం పూర్తిగా కూలిపోయే ప్రమాదం లేకపోలేదు.

మూణ్నాళ్ల ముచ్చటగా తహసీల్ ఆఫీస్ నిర్వహణ..

కాజీపేట తహసీల్ కార్యాలయాన్ని 2018లో కాజీపేట మున్సిపల్ సర్కిల్-2 కార్యాలయంలో అరకొర వసతులతో ఏర్పాటు చేశారు. అనంతరం ఆ కార్యాలయాన్ని కడిపికొండలోని సమాఖ్యభవనంలోకి మార్చారు. అయితే ఇక్కడ తహసీల్ నిర్వాహణ మూణ్నాళ్ల ముచ్చటగా మారింది. కేవలం ఆరు నెలల పాటు నిర్వహించి తిరిగి కాజీపేటకు తరలించారు. దీంతో మళ్లీ సమాఖ్య భవనం నిరుపయోగంగా మారింది.

కార్పొరేషన్‌లో గ్రామాల విలీనం ..

ఉపాధి హామీ కార్యక్రమాలకు అనువుగా ఉండడానికి కడిపికొండలోని రాజీవ్‌గృహకల్ప సముదాయంలో 2012లో రూ.76 లక్షలతో మండల సమాఖ్య భవనం నిర్మించారు. కాగా, 2013లో అర్బన్ పరిధిలోని పలు గ్రామాలు కార్పొరేషన్‌లో విలీనమయ్యాయి. ఇందులో కడిపికొండ కూడా ఉంది. దీంతో మండల సమాఖ్య భవనంలో నిర్వహించాల్సిన డ్వాక్రా గ్రూపు మహిళల కార్యక్రమాలకు మెప్మా కార్యాలయం వేదికైంది. దీంతో మండల సమాఖ్య భవనం నిరుపయోగంగా మారింది.

శుభకార్యాలకు అద్దెకివ్వాలి



నిరుపయోగంగా ఉన్న మండల సమాఖ్య భవనాన్ని వివాహం, ఇతర శుభకార్యాల నిమిత్తం నిరుపేదలకు అద్దెకివ్వాలి. లేదా ఆస్పత్రిగానైనా ఏర్పాటు చేయాలి. అలా కానిపక్షంలో ప్రభుత్వ కార్యాలయాలకైనా వినియోగించాలి.

-కట్కూరి రేవంత్, కడిపికొండ